SK1 one NEWS HD

సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

RNI APTEL / 2018/76380

# సీమకిరణం

SEEMAKIRANAM TELUGU DAILY

ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 08 సంచిక : 22 | పేజిలు : 08, వెల రూ. 2 రూ/ | ఆదివారం 12-04-2026

## ఢిల్లీ రాజకీయాల్లోకి నితీశ్ కుమార్.. రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణం




మార్చి 16న రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన నితీశ్,

1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన నితీశ్..

తాజా పరిణామంతో బీహార్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు మొదలు

## పశ్చిమబెంగాల్‌లో బీజేపీ మేనిఫెస్టో విడుదల



కోల్‌కాతా: పశ్చిమబెంగాల్‌లో మహిళలు, యువత లక్ష్యంగా బీజేపీ తన మేనిఫెస్టో విడుదల చేసింది. పలు వర్గాలను ఆకట్టుకునేలా బీజేపీ హామీలు ఇచ్చింది. ఇంటికి పెద్దగా ఉన్న మహిళకు నెలకు రూ.3 వేలు ఆర్థిక ప్రోత్సాహకం ప్రకటించింది. ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. మేనిఫెస్టోను విడుదల చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు.

## టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు గుడ్ న్యూస్... పెరిగిన కరవు భత్యం



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఉద్యోగుల కరవు భత్యం (డీఏ) 2.1 శాతం పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారికంగా ప్రకటించారు. తాజా పెంపుతో ఆర్టీసీ ఉద్యోగుల డీఏ 50.7 శాతం నుంచి 52.8 శాతానికి చేరింది. ఈ నిర్ణయంతో సుమారు

## బీఆర్ఎస్ ఆరోపణలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన పొంగులేటి..

# తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదని వ్యాఖ్య

- ★ భవిష్యత్తులో కూడా ఇందిరమ్మ రాజ్యాన్ని ప్రజలు దీవించడానికి సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు
- ★ రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది
- ★ సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు అదనంగా ఐదు వందల రూపాయల బోనస్



హైదరాబాద్: తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరిగారు. రాజకీయ విమర్శల విషయంలో మంత్రి పొంగులేటి మరింత ఘాటుగా స్పందిస్తూ, తమకు అంటిన బురదను అధికార పార్టీ నేతలకు అంటించాలని కొంతమంది ప్రయత్నిస్తున్నారని

# సీడబ్ల్యూసీలో పార్లమెంటు వ్యూహాలపై అగ్ర నేతల చర్చ

- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఈ కీలక సమావేశం
- సీడబ్ల్యూసీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు
- మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టం
- ఓబీసీ మహిళలకు ఉప కోటా కల్పించాలనే డిమాండ్‌పై కూడా చర్చ
- జాతీయ రాజకీయాల్లో రాబోయే మార్పులు, కేంద్ర ప్రభుత్వ వ్యూహాలను తిప్పికొట్టే దిశగా కాంగ్రెస్ అగ్రనాయకత్వం



ఢిల్లీ,: దేశ రాజధాని ఢిల్లీ వేదికగా జరుగుతున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్షంగా అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు ఈ భేటీని ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఈ కీలక సమావేశం ప్రారంభమైంది. జాతీయ రాజకీయాల్లో రాబోయే మార్పులు, కేంద్ర ప్రభుత్వ వ్యూహాలను తిప్పికొట్టే దిశగా కాంగ్రెస్ అగ్రనాయకత్వం ఈ సమావేశంలో సమాలోచనలు చేసింది. ఈ భేటీకి కాంగ్రెస్ పార్టీకి చెందిన అగ్రనేతలు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. అనారోగ్య కారణాల దృష్ట్యా సోనియా గాంధీ, సీనియర్ నేత పి. చిదంబరం వర్చువల్‌గా పాల్గొన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, సల్మాన్‌ఖుర్షీద్,అంబికాసోనీ,సచిన్ పైలట్, భూపేశ్, బగేల్ తదితరులు ప్రత్యక్షంగా హాజరయ్యారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుక్కు ఈ సమావేశంలో పాల్గొని తమ రాష్ట్రాల నివేదికలను సమర్పించారు.

## మహిళా రిజర్వేషన్లపై బీజేపీ 'మాస్టర్ ప్లాన్'.. పార్లమెంటు బిల్లుకు ముందే దేశవ్యాప్త ప్రచారం!

### ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో మహిళ బిల్లు చర్చకు రానుంది

ఢిల్లీ, : ఢిల్లీ వేదికగా రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. దశాబ్దాలుగా నలుగుతున్న మహిళా రిజర్వేషన్ల చట్ట సవరణ బిల్లు పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో దీనిని ఒక చారిత్రాత్మక విజయంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీజేపీ భారీ కార్యాచరణను సిద్ధం చేసింది. భారత రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. 2029 ఎన్నికల నుంచే చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు




## గుంపు మేస్త్రీ అంటూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా కల్వకుంట్ల కవిత ఘాటు విమర్శలు



## బట్టల దుకాణాల్లో రహస్య కెమెరాలకు చెక్.. రంగంలోకి షీ నేత్ర టీమ్స్..



హైదరాబాద్‌లో మహిళల భద్రతే లక్ష్యంగా షీ నేత్ర టీమ్స్‌ను ఆయన ప్రారంభం


భాగ్యనగరంలో 7 జోన్లకు 7 ప్రత్యేక షీ నేత్ర టీమ్స్‌ను ఏర్పాటు

గరవ్యాప్తంగా హోటళ్లు, మాల్స్, హాస్టళ్లు వంటి ప్రదేశాల్లో రహస్య కెమెరాలపై ఉక్కుపాదం

షీ టీమ్స్‌తో సమన్వయం కోసం నోడల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచన

హైదరాబాద్: పబ్లిక్, ప్రైవేట్ ప్రదేశాల్లో రహస్య కెమెరాలతో మహిళలను చిత్రీకరించే వారిపై ఉక్కుపాదం మోపుతామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ హెచ్చరించారు. అందుకోసం 'షీ నేత్ర టీమ్స్'ను రంగంలోకి దింపినట్లు ఆయన వెల్లడించారు. హైదరాబాద్‌లో మహిళల భద్రతే లక్ష్యంగా షీ నేత్ర టీమ్స్‌ను ఆయన ప్రారంభించారు. భాగ్యనగరంలో 7 జోన్లకు

## తమిళనాడు తెలుగు యువశక్తి కీలక నిర్ణయం



చెన్నై: తమిళనాడులో నివసిస్తున్న తెలుగు ప్రజల హక్కులు, గౌరవం, అభివృద్ధి కోసం కృషి చేస్తున్న తమిళనాడు తెలుగు యువశక్తి సంస్థ జరగబోయే ఎన్నికల నేపథ్యంలో కీలక రాజకీయ నిర్ణయం తీసుకున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి తెలిపారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ముఖ్యంగా తమిళనాడులో తెలుగు ప్రజల సమగ్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని,

# అమరావతిలో క్వాంటం నవశకం..

### ఏప్రిల్ 14న దేశంలోనే తొలి టెస్ట్ ఫెసిలిటీని ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

- ★ రాజధాని అమరావతికి కీలక స్థానం కల్పించే దిశగా మరో చరిత్రాత్మక అడుగు
- ★ మూడు దశాబ్దాల క్రితం ఐటీ విప్లవంతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిన చంద్రబాబు
- ★ క్వాంటం టెక్నాలజీతో ఏపీ భవిష్యత్తుకు బలమైన పునాదులు
- ★ దేశంలో క్వాంటం టెస్ట్ రిఫరెన్స్ కేంద్రాన్ని కలిగిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్



అమరావతి: ప్రపంచ సాంకేతిక పటంలో ఆంధ్రప్రదేశ్‌కు, ముఖ్యంగా రాజధాని అమరావతికి కీలక స్థానం కల్పించే దిశగా మరో చరిత్రాత్మక అడుగు పడుతోంది. నవశకం టెక్నాలజీ అయిన క్వాంటం కంప్యూటింగ్ రంగంలో దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు చేసిన స్వదేశీ క్వాంటం టెస్టింగ్ రిఫరెన్స్ ఫెసిలిటీని ముఖ్యమంత్రి చంద్రబాబు ఏప్రిల్ 14న ప్రారంభించనున్నారు. ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. ఈ ఫెసిలిటీ అందుబాటులోకి రావడంతో, దేశంలో క్వాంటం టెస్ట్ రిఫరెన్స్ కేంద్రాన్ని కలిగిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవనుంది. గన్నవరంలోని మేధా టవర్స్‌లో 'అమరావతి 1క్యూవ్' పేరుతో, రాజధాని పరిధిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 'అమరావతి 1ఎస్' పేరుతో రెండు అత్యాధునిక క్వాంటం టెస్ట్ బెడ్స్‌ను సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు. ముఖ్యంగా ఎస్ఆర్ఎం వర్సిటీలో ఏర్పాటు చేసిన ఫెసిలిటీని విద్యార్థులు, పరిశోధకుల కోసం 'ఓపెన్ యాక్సెస్' ప్రాతిపదికన అందుబాటులో ఉంచనున్నారు. దీని ద్వారా వారు క్వాంటం కంప్యూటింగ్ ప్రక్రియను ప్రత్యక్షంగా వీక్షించి, పరిశోధనలు చేసేందుకు వీలు కలుగుతుంది. మూడు దశాబ్దాల క్రితం ఐటీ విప్లవంతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిన చంద్రబాబు, ఇప్పుడు క్వాంటం టెక్నాలజీతో ఏపీ భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నారు.

## వైసీపీ నేతలది గుంట నక్కల రాజకీయం - కేంద్ర మంత్రి రామ్మోహన్



శ్రీకాకుళం: శ్రీకాకుళం జిల్లా వ్యవసాయ ఆధారితమని, జిల్లా ప్రజలకు సాగునీటి భద్రత కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. వంశధార నీటిని సద్వినియోగం చేసుకుని జిల్లాను సస్యశ్యామలం చేయాలని పూనుకున్నట్లు ఆయన చెప్పారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో శ్రీకాకుళంలో సాగునీటి వ్యవస్థను గాలికి వదిలేశారని కేంద్ర మంత్రి మండిపడ్డారు. 2010లో వంశధార ట్రైబ్యునల్ ఏర్పాటు అయ్యిందని.. అప్పటి నుంచి నేరడి బ్యారేజ్ విషయంలో ఒడిశాతో ఉన్న సమస్యను పరిష్కరించేందుకు కృషి చేసినట్లు ఆయన చెప్పారు.

నేరడి బ్యారేజ్ సమస్యకు చెక్..

2024లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నేరడి బ్యారేజ్ సమస్యపై దృష్టి పెట్టామని ఈ సందర్భంగా రామ్మోహన్ చెప్పుకొచ్చారు. ఒడిశాలోనూ బీజేపీ ప్రభుత్వం రావటంతో సమస్య పరిష్కారానికి మార్గం సుగమం అయ్యిందని హర్షం వ్యక్తం చేశారు. వంశధార ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పు ఆధారంగా గెజిట్ నోటిఫికేషన్ తెచ్చుకున్నామని.. సుదీర్ఘ కాలం పెండింగ్‌లో ఉన్న సమస్య పరిష్కారమైందని తెలిపారు. దీనిపై వైసీపీ నేతలు ఇప్పుడెందుకు మాట్లాడటం లేదని రామ్మోహన్ నాయుడు ప్రశ్నించారు. కేంద్ర మంత్రి అయినా తన మొదటి ప్రాధాన్యత జిల్లా అభివృద్ధికే అని రామ్మోహన్ స్పష్టం చేశారు.

## రాయలసీమ ప్రాజెక్టులపై చంద్రబాబు వివక్ష: అనంతపురం జిల్లా వైసీపీ నేతల ధ్వజం



రాయలసీమపై చంద్రబాబు కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారు

రాయలసీమకు దక్కాల్సిన న్యాయమైన నీటి వాటా కోసం రాజీలేని పోరాటం చేస్తాం

రాయలసీమ ప్రాంత ప్రాజెక్టుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు మొదటి నుంచి చులకన భావం

కర్నూలు సీమకిరణం నంద్యాల
తెలుగు దినపత్రిక
www.seemakiranam.com, www.seemakiranamnews.com



# ఢిల్లీ రాజకీయాల్లోకి నితీశ్ కుమార్..
# రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణం

ఢిల్లీ: బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో కీలక మలుపు తీసుకున్నారు. ఆయన రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ పరిణామంతో ఆయన ఇక జాతీయ రాజకీయాలకే పరిమితం కానున్నట్లు స్పష్టమైంది. త్వరలోనే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నట్లు నితీశ్ స్వయంగా వెల్లడించారు. ఈ ప్రమాణస్వీకారంతో నితీశ్ కుమార్ తన ఖాతాలో ఓ అరుదైన ఘనతను చేర్చుకున్నారు. రాష్ట్ర శాసనసభ, శాసనమండలి, లోక్‌సభ, రాజ్యసభ.. ఇలా నాలుగు చట్టసభల్లోనూ సభ్యుడిగా పనిచేసిన కొద్దిమంది నేతల జాబితాలో ఆయన చేరారు. రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణస్వీకార కార్యక్రమం కోసం ఆయన గురువారమే ఢిల్లీకి చేరుకున్నారు. మార్చి 16న రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన నితీశ్, మార్చి 30న తన శాసనమండలి సభ్యత్వానికి (ఎమ్మెల్సీ) రాజీనామా చేశారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఆయన ముఖ్యమంత్రి పదవి నుంచి కూడా తప్పుకోవాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా ఢిల్లీలో నితీశ్ కుమార్ మాట్లాడుతూ.. "బీహార్‌లో చాలా పనులు చేశాను. ఇక ఇక్కడే (ఢిల్లీ) ఉండి సేవ చేయాలని భావిస్తున్నాను. మూడు నాలుగు రోజుల్లో సీఎం పదవికి రాజీనామా చేస్తాను. కొత్త ముఖ్యమంత్రి, మంత్రులు బాధ్యతలు చేపడతారు" అని స్పష్టం చేశారు. 2005 నవంబర్‌లో ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి నితీశ్ కుమార్ అసెంబ్లీకి పోటీ చేయకుండా, శాసనమండలి సభ్యుడిగానే కొనసాగుతున్నారు. 2006 నుంచి వరుసగా నాలుగుసార్లు ఆయన ఎమ్మెల్సీగా పనిచేశారు. 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన నితీశ్, ఆ తర్వాత లోక్‌సభ ఎంపీగా కూడా సేవలందించారు. తాజా పరిణామంతో బీహార్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు మొదలుకానున్నాయి.

## పశ్చిమబెంగాల్‌లో బీజేపీ మేనిఫెస్టో విడుదల

మొదటి పేజి తరువాయి

మేనిఫెస్టోను విడుదల చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. 15 ఏళ్ల మమతా బెనర్జీ పాలనపై ప్రజలు తీవ్ర నిరాశలో ఉన్నారన్నా అమిత్ షా.. బెంగాల్‌లో చీకటి పాలన ముగుస్తుందన్నారు. వికసిత్ బెంగాల్ రోడ్‌మ్యాప్‌ను మేనిఫెస్టోలో పెట్టాం. పేదలకు ఆయుష్మాన్ భారత్ స్కీమ్ అమలు చేస్తామన్న అమిత్ షా.. రైతుల సంక్షేమం, యువత ఉపాధి అవకాశాలపై కీలక హామీలు ఇచ్చారు. మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. అధికారంలోకి వచ్చాక బెంగాల్‌లో యూసీసీ అమలు చేస్తామని తెలిపారు. భయం లేని బెంగాల్.. పునర్నిర్మాణమే తమ లక్ష్యం అన్న అమిత్ షా.. బీజేపీకి ఒకసారి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. చొరబాటుదారుల ఏరివేత.. 7వ పే కమిషన్ అమలు చేస్తామని తెలిపారు. "ఆరు నెలల్లో ఉమ్మడి పౌరస్మృతి అమలు. ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షనర్లకు డిఏ చెల్లింపులు. మహిళలకు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్. రాజకీయ హింస కేసులపై ముమ్మర దర్యాప్తు. బంగ్లాదేశ్ సరిహద్దులో ఫెన్సింగ్ కోసం భూముల కేటాయింపు. ఆవుల స్మగ్లింగ్ నిలిపివేస్తాం. దుర్గా సురక్ష స్క్వాడ్ ఏర్పాటు" చేస్తామని అమిత్ షా తెలిపారు.

## టీజీఎస్‌ఆర్టీసీ ఉద్యోగులకు గుడ్ న్యూస్... పెరిగిన కరవు భత్యం

మొదటి పేజి తరువాయి

తాజా పెంపుతో ఆర్టీసీ ఉద్యోగుల డీఏ 50.7 శాతం నుంచి 52.8 శాతానికి చేరింది. ఈ నిర్ణయంతో సుమారు 38 వేల మందికి పైగా ఆర్టీసీ సిబ్బందికి లబ్ధి చేకూరనుంది. డీఏ పెంపు నిర్ణయం 2026 జనవరి నుంచే అమల్లోకి వస్తుందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. జనవరి నుంచి మార్చి వరకు మూడు నెలల బకాయిలను రాబోయే నెలల్లో సప్లిమెంటరీ బిల్లుల ద్వారా విడతలవారీగా చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ డీఏ పెంపు వల్ల ఆర్టీసీపై ప్రతి నెలా అదనంగా రూ.2.82 కోట్ల ఆర్థిక భారం పడనుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి పూర్తిగా కట్టుబడి ఉందని, ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని పునరుద్ఘాటించారు. సాధారణంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉద్యోగులకు ఏటా జనవరి, జులై నెలల్లో డీఏను సవరిస్తారు. గత ఏడాది జులైలో కూడా ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం 2.1 శాతం డీఏ పెంచింది. తాజాగా మరోసారి డీఏను పెంచుతూ నిర్ణయం తీసుకోవడం పట్ల ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' పథకం ఆర్టీసీకి ఆర్థికంగా ఊతమిస్తోంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగి, సంస్థ ఆదాయం వృద్ధి చెందింది. గత ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి నాటికి ఆర్టీసీ సుమారు రూ.954 కోట్ల నిర్వహణ లాభాన్ని ఆర్జించింది. మహాలక్ష్మి పథకానికి సంబంధించిన రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఆర్టీసీకి చెల్లిస్తుండటంతో సంస్థ కార్యకలాపాలు సజావుగా సాగుతున్నాయి. ఇదే సమయంలో కొత్త బస్సులను కొనుగోలు చేసి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం ద్వారా లాభాలను మరింత పెంచుకోవాలని ఆర్టీసీ యాజమాన్యం ప్రణాళికలు రచిస్తోంది.

## బీఆర్ఎస్ ఆరోపణలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన పొంగులేటి..
### - తాటాకు చప్పుళ్లకు బెదిరేది లేదని వ్యాఖ్య

హైదరాబాద్: తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీపై నిప్పులు చెరిగారు. రాజకీయ విమర్శల విషయంలో మంత్రి పొంగులేటి మరింత ఘాటుగా స్పందిస్తూ, తమకు అంటిన బురదను అధికార పార్టీ నేతలకు అంటించాలని కొంతమంది ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఎవరు ఎన్ని అవాకులు చవాకులు పేలినా, కారుకూతలు కూసినా ఈ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని, ప్రతిపక్షాల తాటాకు చప్పుళ్లకు తాము బెదిరే ప్రసక్తే లేదని హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా ఇందిరమ్మ రాజ్యాన్ని ప్రజలు దీవించడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చేగొమ్మలో నూతనంగా నిర్మించిన గోదాము ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ధాన్యం సేకరించిన వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని స్పష్టం చేశారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతు భరోసా కింద ప్రతి ఎకరానికి రూ. 12,000 అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ వల్ల రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను తొలగించేందుకు దానిని బంగాళాఖాతంలో కలిపి, పారదర్శకమైన 'భూ భారతి' విధానాన్ని తీసుకొచ్చామని ఆయన పేర్కొన్నారు. దీని ద్వారా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల ఎనభై వేల మంది రైతులకు కొత్త పాస్ పుస్తకాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు అదనంగా ఐదు వందల రూపాయల బోనస్ ఇస్తున్నామని, పండించిన సన్న బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించకుండా రేషన్ ద్వారా రాష్ట్రంలోని పేదలకు అందిస్తున్నామని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, సీపీ సునీల్ దత్ మరియు పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## గుంపు మేస్త్రీ అంటూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా
## - కల్వకుంట్ల కవిత ఘాటు విమర్శలు

హైదరాబాద్: హైదరాబాద్ నగరాభివృద్ధి ముసుగులో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో భారీ ఎత్తున అవినీతి జరుగుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. ఈరోజు మీడియాతో మాట్లాడిన ఆమె, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. ప్రధానంగా హెచ్ఎండీఏ పరిధిలో సుమారు 35 వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను విక్రయానికి పెట్టారని, అయితే ఆ నిధులను నగర అభివృద్ధికి వెచ్చించకుండా దారి మళ్లిస్తున్నారని ఆమె ఆరోపించారు. హెచ్ఎండీఏకు చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా స్వయంగా ముఖ్యమంత్రే ఉన్నారని గుర్తు చేస్తూ, ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌లో ఆయన అనుచరుల కనుసన్నల్లోనే పనులు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. ముఖ్యంగా టెండర్ల ప్రక్రియలో నిబంధనలను తుంగలో తొక్కారని కవిత ఆరోపించారు. గతంలో నామినేషన్ పద్ధతిలో జరిగిన పనుల కంటే, రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత సుమారు 1,140 కోట్ల రూపాయల కాంట్రాక్టులను అదే పద్ధతిలో అప్పగించారని, ఇది ఆర్థిక శాఖ నిబంధనలకు విరుద్ధమని ఆమె పేర్కొన్నారు. పారదర్శకమైన టెండర్ల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండికొట్టి, కేవలం అవినీతి కోసమే 'ఫ్యూచర్ సిటీ' పేరుతో సరికొత్త నాటకాలకు తెరలేపారని విమర్శించారు. జీహెచ్ఎంసీ పాలన ప్రస్తుతం 'గుంపు మేస్త్రి' చేతుల్లో చిక్కి మహా అవినీతికి నిలయంగా మారిందని ఆమె వ్యాఖ్యానించారు. ఔటర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో గతంలో సిట్ వేయించిన ముఖ్యమంత్రి, ఇప్పుడు అదే కాంట్రాక్టును ఎలా కొనసాగిస్తున్నారని ఆమె ప్రశ్నించారు.

## బట్టల దుకాణాల్లో రహస్య కెమెరాలకు చెక్..
# రంగంలోకి షీ నేత్ర టీమ్స్..

మొదటి పేజి తరువాయి



హైదరాబాద్‌లో మహిళల భద్రతే లక్ష్యంగా షీ నేత్ర టీమ్స్‌ను ఆయన ప్రారంభించారు. భాగ్యనగరంలో 7 జోన్లకు 7 ప్రత్యేక షీ నేత్ర టీమ్స్‌ను ఏర్పాటు చేశారు సీపీ సజ్జనార్. ఆయన తన చేతుల మీదుగా ఆయా బృందాలకు కెమెరా డిటెక్టర్ల అందజేశారు. మహిళల ఆత్మగౌరవం, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే రహస్య కెమెరాల గుట్టును ఈ బృందాలు రట్టు చేయనున్నాయి. నగరవ్యాప్తంగా హోటళ్లు, మాల్స్, హాస్టళ్లు వంటి ప్రదేశాల్లో రహస్య కెమెరాలపై ఉక్కుపాదం మోపనున్నాయి. ముఖ్యంగా బట్టల దుకాణాల్లోని ట్రయల్ రూమ్స్, ప్రైవేట్ ప్రదేశాల్లో ప్రత్యేక తనిఖీలు చేయనున్నారు. ఇకపై అత్యాధునిక కెమెరా డిటెక్టర్లతో ఆకస్మిక సోదాలు నిర్వహించనున్నారు. ఈ బృందాల ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడిన సీపీ సజ్జనార్.. బట్టల దుకాణాలు, హోటళ్లు, హాస్టళ్లు, మాల్స్ వంటి ప్రాంతాల్లో ఆడవారి భద్రత ఆయా సంస్థల యాజమాన్యాలదే అని తేల్చిచెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే సంస్థలు, సిబ్బందిని బ్లాక్‌లిస్టులో పెట్టే విధంగా చర్యలు ఉంటాయని చెప్పారు. ప్రతి సంస్థలో కస్టమర్ సేఫ్టీ ఇన్‌ఛార్జ్ నియామకం తప్పనిసరని ఆదేశాలిచ్చారు. షీ టీమ్స్‌తో సమన్వయం కోసం నోడల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సూచించారు. అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీపీ సజ్జనార్ చెప్పారు.

# మహిళా రిజర్వేషన్లపై బీజేపీ 'మాస్టర్ ప్లాన్'.. పార్లమెంటు బిల్లుకు ముందే దేశవ్యాప్త ప్రచారం!

మొదటి పేజి తరువాయి

2029 ఎన్నికల నుంచే చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా చట్టంలో అవసరమైన సవరణలు తీసుకువచ్చేందుకు రంగం సిద్ధమైంది.

పలు రాష్ట్రాల అధ్యక్షులతో నితిన్ నబీన్ కీలక భేటీ..

మహిళ బిల్లుపై దేశవ్యాప్త అవగాహన కల్పించేందుకు బీజేపీ జాతీయ నాయకత్వం వ్యూహరచన చేస్తోంది. ఇందులో భాగంగానే ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో పలు రాష్ట్రాల అధ్యక్షులతో జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావుతో పాటు ఇరు రాష్ట్రాల ఇన్‌చార్జ్ కార్యదర్శులు హాజరయ్యారు. పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టడానికి ఉన్న ఈ ఐదు రోజుల్లో పలు రాష్ట్రాల వ్యాప్తంగా మహిళా మోర్చా ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనలు..

ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు ప్రత్యేక




సమావేశాల్లో మహిళ బిల్లు చర్చకు రానుంది. మూడు రోజుల్లోనే వీటికి ఆమోద ముద్ర వేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. మహిళా రిజర్వేషన్లను 2029 సాధారణ ఎన్నికల నుంచి అమల్లోకి తీసుకురావాలని మోదీ ప్రభుత్వం ప్రతిపాదించింది. దీనివల్ల చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం గణనీయంగా పెరుగుతుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన రిజర్వేషన్ల అమలుకు, నియోజకవర్గాల పునర్విభజనకు బీజేపీ సర్కార్ సిద్ధమవుతోంది. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ప్రస్తుతం ఉన్న స్థానాల సంఖ్యను 50 శాతం వరకు పెంచాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. ఈ విషయంపై ఇప్పటికే కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్ని పార్టీలతో సంప్రదింపులు జరిపారు.

మహిళా రిజర్వేషన్లపై భిన్నాభిప్రాయాలు..

మహిళా రిజర్వేషన్లకు అన్ని పార్టీలు మద్దతు ఇస్తున్నప్పటికీ, అమలు చేసే విధానంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విపక్ష పార్టీలు 2011 గణాంకాల కంటే, 2026 జనాభా లెక్కలనే ప్రాతిపదికగా తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. నియోజకవర్గాల సంఖ్య పెంచడం వల్ల దక్షిణ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం తగ్గుతుందనే ఆందోళనల నేపథ్యంలో 2026 లెక్కల ప్రాధాన్యతను విపక్షాలు నొక్కి చెబుతున్నాయి. పార్లమెంటులో మహిళ బిల్లు ఆమోదం పొందిన తర్వాత దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున విజయోత్సవ ర్యాలీలు నిర్వహించి, మహిళా ఓటర్లను తమవైపు తిప్పుకోవాలని బీజేపీ భావిస్తోంది. 2029 ఎన్నికల ముఖచిత్రాన్ని మార్చే ఈ చట్ట సవరణ బిల్లు భారత ప్రజాస్వామ్యంలో ఒక మైలురాయిగా నిలవనుంది. ఈ కీలక బిల్లుపై పార్లమెంటులో ఎలాంటి చర్చ జరుగుతుందోనని దేశమంతా ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

# అమరావతిలో క్వాంటం నవశకం..
## ఏప్రిల్ 14న దేశంలోనే తొలి టెస్ట్ ఫెసిలిటీని ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

మొదటి పేజి తరువాయి

మూడు దశాబ్దాల క్రితం ఐటీ విప్లవంతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిన చంద్రబాబు, ఇప్పుడు క్వాంటం టెక్నాలజీతో ఏపీ భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తున్నారు.

హార్డ్‌వేర్ తయారీకి కేంద్రంగా అమరావతి

కేవలం సాఫ్ట్‌వేర్ అల్గారిథమ్స్‌కే పరిమితం కాకుండా క్వాంటం కంప్యూటర్ల హార్డ్‌వేర్ తయారీలోనూ స్వయం సమృద్ధి సాధించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం. ఈ ఆశయ సాధనలో భాగంగానే అమరావతిలో ఈ టెస్టింగ్ ఫెసిలిటీలను ఏర్పాటు చేశారు. మైనస్ 273 డిగ్రీల సెల్సియస్ అత్యంత శీతల ఉష్ణోగ్రత వద్ద పనిచేసే ఈ కేంద్రాల్లో, క్వాంటం కంప్యూటర్లకు అవసరమైన పరికరాలను పరీక్షించి, సర్టిఫికేషన్ ఇస్తారు. ఇటీవలే 30కి పైగా క్వాంటం హార్డ్‌వేర్ తయారీ సంస్థలతో సీఎం సమావేశమై, అమరావతిని దేశ క్వాంటం హార్డ్‌వేర్ నెట్‌వర్క్‌కు యాంకర్ నోడ్‌గా తీర్చిదిద్దాలని



నిర్దేశించారు. క్రయోజెనిక్స్, ప్రెసిషన్ ఎలక్ట్రానిక్స్ వంటి రంగాల్లో స్వదేశీ ఉపకరణాల తయారీకి ఈ కేంద్రం ఊతమివ్వనుంది.

గ్లోబల్ హబ్‌గా క్వాంటం వ్యాలీ

అమరావతిని ప్రపంచంలోని మొదటి 5 క్వాంటం హబ్‌లలో ఒకటిగా నిలపాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉద్దండరాయునిపాలెంలో 50 ఎకరాల్లో 'అమరావతి క్వాంటం వ్యాలీ'ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. ఇందులో భాగంగా అంతర్జాతీయ టెక్ దిగ్గజం ఐబీఎం భాగస్వామ్యంతో 133 క్యూబిట్ సామర్థ్యమున్న శక్తివంతమైన క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు కానుంది. టీసీఎస్, ఎల్ అండ్ టీ, టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ వంటి సంస్థలు ఈ ప్రాజెక్టులో పాలుపంచుకుంటున్నాయి. నూతన ఔషధాల ఆవిష్కరణ, వాతావరణ అంచనాలు, సెమీ కండక్టర్ల డిజైన్, రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో కీలక పరిశోధనలకు ఈ కేంద్రం వేదిక కానుంది. ఇప్పటికే 80కి పైగా అంతర్జాతీయ సంస్థలు, వర్సిటీలు ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయి. క్వాంటం నైపుణ్యాల కల్పనలో భాగంగా ఐదేళ్లలో 45 లక్షల మంది నిపుణులను తయారు చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది.

# సీడబ్ల్యూసీలో పార్లమెంటు వ్యూహాలపై అగ్ర నేతల చర్చ

మొదటి పేజి తరువాయి

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్విందర్ సింగ్ సుక్కు ఈ సమావేశంలో పాల్గొని తమ రాష్ట్రాల నివేదికలను సమర్పించారు.

చర్చకు రానున్న ప్రధాన అంశాలు..

కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను ప్రకటించిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధానంగా ఈ క్రింది అంశాలపై తన వాణిని వినిపించాలని నిర్ణయించింది.

మహిళా రిజర్వేషన్ బిల్లు: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుపై కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన వైఖరిని ఖరారు చేయనుంది. ఓబీసీ మహిళలకు ఉప కోటా కల్పించాలనే డిమాండ్‌పై కూడా చర్చించారు.

నియోజకవర్గాల పునర్విభజన: 2026 తర్వాత జరగనున్న నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయంపై సీఎంలు రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్య తమ వాదనలు వినిపించారు.

పశ్చిమాసియా సంక్షోభం: అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు, భారతదేశంపై వాటి ప్రభావం, భారత్ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై చర్చించారు.




పార్లమెంటు వ్యూహం: కేవలం మూడు రోజుల పాటు జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోయే బిల్లులను ఎలా అడ్డుకోవాలి లేదా చర్చలో ఎలా పైచేయి సాధించాలనే అంశంపై సభ్యులకు కాంగ్రెస్ అగ్రనేతలు దిశానిర్దేశం చేశారు.

రాజకీయ ప్రాధాన్యం

రాబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నరేంద్రమోదీ ప్రభుత్వం అనూహ్యంగా ప్రత్యేక సమావేశాలను పిలవడంతో ఈ జబెజ భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా తెలంగాణ వంటి రాష్ట్రాల్లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పార్టీ బలోపేతంపై సీఎం రేవంత్‌రెడ్డి సీడబ్ల్యూసీ సమావేశంలో కీలక ప్రసంగం చేసే అవకాశం ఉంది.

ఎన్నికల ప్రయోజనాల కోసమే పార్లమెంట్ సమావేశాలు: మల్లికార్జున ఖర్గే

సీడబ్ల్యూసీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఎన్నికల ప్రయోజనాల కోసమేనని చెప్పారు. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారికంగా ఎటువంటి ప్రతిపాదన కాంగ్రెస్ ముందుకు రాలేదని అన్నారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలోనే మహిళా రిజర్వేషన్లపై స్పష్టతని ఇచ్చామని, కేంద్రాన్ని డిమాండ్ కూడా చేశామని ప్రస్తావించారు. వెస్ట్ బెంగాల్, తమిళనాడు ఎన్నికలు జరుగుతున్న వేళ హఠాత్తుగా మహిళా రిజర్వేషన్ల బిల్లు సవరణ , పునర్విభజన చట్టం సవరణ బిల్లులను తెరపైకి తీసుకువచ్చారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాక అఖిలపక్ష సమావేశం పెట్టాలని పార్లమెంటులో ప్రతిపక్ష పార్టీలన్నీ కోరాయని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం తమ ప్రయోజనాల కోసం ప్రయత్నం చేస్తుందని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.

## వైసీపీ నేతలది గుంట నక్కల రాజకీయం - కేంద్ర మంత్రి రామ్మోహన్

మొదటి పేజి తరువాయి

శ్రీవారి భక్తులకు గుడ్ న్యూస్..

త్వరలో నేరడి బ్యారేజ్ పనులు ప్రారంభమవుతాయని.. రైల్వే జోన్ సాధించుకోవటం మరో విజయమంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఉద్దానం ప్రాంతంలోని ఏడు రైల్వేస్టేషన్లను కొత్త రైల్వే జోన్‌లో పెట్టించినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. తిరుపతి వెళ్లే భక్తుల కోసం హంసఫర్ ఎక్స్‌ప్రెస్ ఇకపై శ్రీకాకుళం నుంచి బయలుదేరుతుందంటూ ఆయన గుడ్ న్యూస్ చెప్పారు. పలాసలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేశామని.. పొందూరు ఖాదీకి జియో ట్యాగ్ సాధించామనీ వెల్లడించారు. కేంద్రం నుంచి జిల్లాకు అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా చూస్తున్నానని రామ్మోహన్ పేర్కొన్నారు.

అభివృద్ధిని వైసీపీ జీర్ణించుకోలేదు..!

జిల్లాలో అభివృద్ధి జరుగుతుంటే వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని కేంద్ర మంత్రి రామ్మోహన్ ఆగ్రహించారు. ప్రజల కోసం పని చేసే నేతలైతే కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేసిన పనులను అభినందించాలని డిమాండ్ చేశారు. అమరావతి రాజధాని బిల్లు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందడం చరిత్రాత్మక ఘట్టమని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. అమరావతి బిల్లుకు కాంగ్రెస్ కూడా మద్దతు ఇచ్చిందని.. జగన్ పార్టీ మాత్రం బిల్లు సందర్భంగా పార్లమెంట్ నుంచి వాకౌట్ చేసిందని మండిపడ్డారు. అమరావతి చట్టబద్ధత కోసం సీఎం చంద్రబాబు నాయుడు చాలా కృషి చేశారని చెప్పుకొచ్చారు. రాజధానిగా అమరావతికి రాష్ట్ర ప్రజలు ఎన్నికల ద్వారా సంపూర్ణ మద్దతు ఇచ్చారని చెప్పుకొచ్చారు.

వైసీపీకి ఇంకా బుద్ధి రాలేదు..

అధికారంలో ఉన్నప్పుడు రాజధానిపై జగన్ మూడు ముక్కలాట ఆడారని.. ఇప్పుడూ అదే డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. అమరావతి పూర్తయితే చంద్రబాబు పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్న భయం వైసీపీదని ఆరోపించారు. జాతీయస్థాయిలో చంద్రబాబుది ఓ ప్రత్యేక గుర్తింపని కొనియాడారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకూడదనేది వైసీపీ అజెండా అయితే.. చంద్రబాబుది అభివృద్ధి అజెండా అని పేర్కొన్నారు. ప్రజలు ఛీ కొట్టినా వైసీపీకి ఇంకా బుద్ధి రాలేదని.. చరిత్ర హీనులుగా మిగిలిపోవడం ఖాయమంటూ నిప్పులు చెరిగారు. విశాఖ రాజధాని పేరుతో వైసీపీ నేతలు భూదందా చేశారని ఆరోపించారు రామ్మోహన్ నాయుడు. త్వరలో భోగాపురం ఎయిర్ పోర్టు, మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు పూర్తవుతాయని.. కేంద్రం సహకారంతో రాష్ట్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. ఒక పక్క అభివృద్ధి జరుగుతుంటే మరో పక్క వైసీపీ నేతలు గుంట నక్క రాజకీయాలు చేస్తున్నారని కేంద్ర మంత్రి ఆగ్రహించారు.

## రాయలసీమ ప్రాజెక్టులపై చంద్రబాబు వివక్ష: అనంతపురం జిల్లా వైసీపీ నేతల ధ్వజం




అనంతపురం: చంద్రబాబుకి రైతుల కష్టాలు పట్టవని.. రాయలసీమ అంటే మొదటి నుంచి ఆయనకు చులకనేనని వైఎస్సార్‌సీపీ నేతలు అంటున్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ సాధన కోసం వైఎస్సార్‌సీపీ పోరును ఉధృతం చేసింది. ఈ క్రమంలో శుక్రవారం అనంతపురంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు అర్ధాంతరంగా నిలిపివేయడం వెనుక పెద్ద కుట్ర ఉంది. తాను చెబితేనే చంద్రబాబు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు ఆపేశారని తెలంగాణ సీఎం రేవంత్ అంటున్నారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఎందుకు స్పందించలేదు. రాయలసీమ అంటే చంద్రబాబు కు ఎందుకు చులకన?. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు సీమ ప్రాజెక్టులకు ఇన్సూరెన్స్ వంటిది మాజీ మంత్రి శైలజానాథ్ మాట్లాడుతూ.. తెలంగాణకు మేం వ్యతిరేకం కాదు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు నిలిపివేయడం దుర్మార్గం. ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరి అనుమానాస్పదంగా ఉంది. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు పూర్తయితేనే తెలంగాణ మాదిరి శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 800 అడుగుల్లో నీరు తీసుకోవచ్చు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 854 అడుగుల్లో నీరు తరలించటం అసాధ్యం. నీటి వాటాలు ఖచ్చితంగా తీసుకొచ్చేందుకే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఉపయోగపడుతుంది. రాయలసీమ పై ముఖ్యమంత్రి చంద్రబాబు కక్ష సాధింపు తో వ్యవహరిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై చంద్రబాబు ఎందుకు మౌనంగా ఉన్నారు?. సీఎం రేవంత్ కోరితే... రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఆపేస్తారా??. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు దొంగ ప్రాజెక్టు అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అంటున్నారు. దొంగ ప్రాజెక్టు అయితే మీరెందుకు వెయ్యి కోట్ల రూపాయల బిల్లులు విడుదల చేశారో పయ్యావుల కేశవ్ చెప్పాలి. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు పూర్తయితేనే సీమ ప్రాజెక్టు లకు నీరు అందుతుంది. చంద్రబాబు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై పోరాటాలు ఉధృతం చేయాలి. ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమ సాగు తాగు నీటి కష్టాలు తీర్చిన ఘనత వైఎస్ రాజశేఖరరెడ్డిదే. అదే స్ఫూర్తి ని కొనసాగించేందుకే వైఎస్ జగన్ రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు చేపట్టారు. రాయలసీమకు అడుగడుగునా అన్యాయం చేసిన ఘనుడు చంద్రబాబు. హైకోర్టు, ఎయిమ్స్, ఇతర ప్రాజెక్టులను ఇతర ప్రాంతానికి తరలించారు. రాయలసీమ అభివృద్ధి పై చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లకు చిత్తశుద్ధి ఏది?. సీమ వాసులు టీడీపీ కూటమికే పట్టం కడితే... మీరు చేస్తున్నది ఏమిటి?. సీఎం రేవంత్ రెడ్డి చెప్పేదాకా రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు ఆగిపోయాయని చాలా మందికి తెలియదు. టీడీపీ కూటమి కి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉంది ఈ సమావేశంలో.. మాజీ మంత్రులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, వై. వెంకట్రామిరెడ్డి, మెట్టు గోవిందరెడ్డి, మాజీ ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తమిళనాడు తెలుగు యువశక్తి కీలక నిర్ణయం

మొదటి పేజి తరువాయి

ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ముఖ్యంగా తమిళనాడులో తెలుగు ప్రజల సమగ్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, తాను తాళి నియోజకవర్గం నుండి పోటీ చేయకుండా.. ప్రజా ప్రయోజనాల కోసం, సమాన హక్కుల కోసం మరింత బలంగా పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. "తమిళనాడులో సుమారు 70--80 లక్షల తెలుగు ప్రజలు నివసిస్తున్నారు. ముఖ్యంగా ఈ జిల్లాల్లో అధిక ప్రభావం ఉంది. చెన్నై, తిరువల్లూర్, కాంచీపురం, తిరువన్నామలై, వెల్లూర్, కృష్ణగిరి, సేలం, ఈరోడ్, కోయంబత్తూర్, మధురై, తిరుచ్చి, తంజావూరు, చెంగల్పట్టు ఈ ప్రాంతాలు అనేక నియోజకవర్గాల్లో ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే శక్తిగా ఉన్నాయి...సీఎం స్టాలిన్ నాయకత్వంలో తెలుగు సంతతికి చెందిన నాయకులకు గౌరవప్రదమైన స్థానం లభించింది. సుమారు నలుగురు తెలుగు మంత్రులు మంత్రివర్గంలో ఉన్నారు. దాదాపు 20--25 మంది ఎమ్మెల్యేలు తెలుగు ప్రజలను ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇది తెలుగు ప్రజలకు సమాన అవకాశాలు, గౌరవం కల్పించే సమగ్ర పాలనకు నిదర్శనం"అని కేతిరెడ్డి పేర్కొన్నారు. సినీ నటి కస్తూరి... తెలుగు ప్రజలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సమయంలో, తమిళనాడు ప్రభుత్వం తక్షణమే స్పందించి.. తెలుగు ప్రజల గౌరవాన్ని కాపాడే




విధంగా చర్యలు తీసుకుంది. ఈ సంఘటన ద్వారా తెలుగు ప్రజల గౌరవం, స్వాభిమానం కాపాడటంలో ప్రస్తుత ప్రభుత్వం ఎంత కట్టుబడి ఉందో స్పష్టమవుతుంది. తమిళనాడు తెలుగు యువశక్తి.. రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తుంది. తెలుగు ఓటర్లను ఏకతాటిపైకి తీసుకువస్తుంది. డీఎంకే, ఆ పార్టీ కూటమి అభ్యర్థుల విజయానికి కట్టుబడి పనిచేస్తుంది. తమిళనాడులో తెలుగు ప్రజల భద్రత, గౌరవం, ప్రాతినిధ్యం, అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్న ప్రభుత్వం డీఎంకే మాత్రమే. ఈ ఎన్నికల్లో డీఎంకే విజయం ఖాయం" అని కేతిరెడ్డి పేర్కొన్నారు.

# పూలే ఆశయాలను సాధిద్దాం

ఎమ్మెల్యే కోట్ల




**ప్యాపిలి ఏప్రిల్ 11 (సీమ కిరణం న్యూస్ ) :** సామాజిక అసమానతలను తొలగించడమే మహాత్మ జ్యోతిబాపూలే ఆశయమని, పూలే ఆశయాలను, ఆలోచనలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని డోన్ నియోజవర్గ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పూలే 200వ జయంతి వేడుకలను టిడిపి శ్రేణులు నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కోట్ల హాజరై పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక సమానత్వం సాధన కోసం జ్యోతిబాపూలే అప్పటి సమాజంలో పోరాటం చేశారని, బాలిక విద్యపై పూలే దంపతులు చిత్తశుద్ధితో పనిచేశారని, స్త్రీలు విద్యావంతులు కావాలని ఆకాంక్షించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లక్కసాగరం లక్ష్మీరెడ్డి,మండల టిడిపి ఇన్చార్జి ఎద్దుల దొడ్డి ప్రభాకర్ రెడ్డి,మాజీ ఎంపీపీ తొప్పేల శ్రీనివాసులు, మైనారిటీ నాయకులు ఖాజా పీర్, సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ యాదవ్,రాజా నారాయణ మూర్తి,రామ్మోహన్ యాదవ్,మెట్టుపల్లె సుదర్శన్, కొంగనపల్లి మధు, నడిగడ్డ నాగేంద్ర, ఎస్కె వలి,చల్లా వీరాంజనేయులు, చల్లా అనుదీప్, సయ్యద్ అక్బర్ వలి, హుసేనాపురం చంద్రశేఖర్, వార్డు మెంబర్ వెంకటేష్, ఆర్సీ మద్దిలేటి, కోదండ రామయ్య యాదవ్, పోదొడ్డి ముచ్చు రవి, నారాయణ,కదిరప్ప, సిద్ధపు పుల్లారెడ్డి, చిన్న పూజర్ల దస్తగిరి, తదితర టిడిపి నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సూపరింటెండెంట్ తనిఖీ






**కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 11 (సీమకిరణం న్యూస్) :** కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె . వెంకటేశ్వర్లు శనివారం ఆసుపత్రిలోని ఎఎంసి వార్డును సందర్శించారు. వార్డులో ప్రస్తుతం జరుగుతున్న ఎలక్ట్రికల్ పనులను అలాగే నూతన ఆక్సిజన్ ప్యానెల్ బోర్డ్స్ ను అమర్చడం వంటి పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. పనుల నాణ్యతను తనిఖీ చేసి, విద్యుత్ మరియు ఆక్సిజన్ సౌకర్యాల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు.అనంతరం, వార్డులో రోగులకు అందుతున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. వైద్య సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్న సూపరింటెండెంట్ గారు రోగులకు నిరంతరం అందుబాటులో ఉండి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఆసుపత్రి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకూడదని, రోగుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



**అనకాపల్లి ప్రతినిధి ఏప్రిల్ 11 (సీమకిరణం న్యూస్) :**అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి: ఎమ్మెల్యే కొణతాలఅనకాపల్లి నియోజకవర్గ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ శనివారం సమీక్ష నిర్వహించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో జీవీఎంసీ అధికారులతో జరిగిన ఈ సమావేశంలో, కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఆయన అడిగి తెలుసుకున్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే, త్వరలో చేపట్టబోయే పనుల వివరాలను కూడా పరిశీలించారు. ఈ సమీక్షలో జోనల్ కమిషనర్ చక్రవర్తి కూడా పాల్గొన్నారు.

# చోడవరం లో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఘనంగా నిర్వహణ



**అనకాపల్లి బ్యూరో ఇంచార్జ్ ఏప్రిల్ 11 (సీమకిరణం న్యూస్)** :చోడవరం అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఈరోజు చోడవరం పార్టీ కార్యాలయంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు పూలే మహాశయుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే గారి సేవలు అపారమని కొనియాడారు. ఆయన ఆశయాలను సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు గూనూరు మల్లు నాయుడు, టౌన్ పార్టీ అధ్యక్షులు ఎర్రంశెట్టి చిన్న, బొబ్బిలి ప్రసాద్, ఎంపీటీసీ రూపా దేవి, మాజీ వార్డు సభ్యులు టి. శ్రీనివాస్, నేమాల హరి, పట్నాల సంతోష్, రొంగళి దివ్య, రొంగళి మంగా, యువ నాయకులు సకురు కోటేశ్వరరావు, నౌడు సుధాకర్, పాల సంఘం అధ్యక్షులు ఈర్లి శ్రీనివాస్, మాదిరెడ్డి జోగి నాయుడు, ముడుసు గోవింద్, పార్థురాజు వర్మ, కండిపల్లి అప్పలరాజు, తాడిపనసారెడ్డి తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పూలే గారి స్ఫూర్తిని గుర్తు చేసుకుంటూ, సమానత్వ సమాజ నిర్మాణం కోసం ముందుకు సాగుదామని నాయకులు సంకల్పం వ్యక్తం చేశారు.

# అభివృద్ధి ప్రదాత మంత్రి'ఆనం' ను కలిసిన రాష్ట్ర డైరెక్టర్, సాగునీటి సంఘాలఅధ్యక్షులు,టిడిపి నేతలు





**నెల్లూరు, ఆత్మకూరు ఏఎస్ పేట ఏప్రిల్ 11(సీమ కిరణం న్యూస్) :** రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ను విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ఎడ్యుకేషన్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ వెల్ఫేర్ డెవలప్మెంట్ డైరెక్టర్, ఏఎస్ పేట మండల టిడిపి కన్వీనర్ అబ్బూరి రమేష్ నాయుడు, సాగునీటి సంఘాల అధ్యక్షులు,మండల టిడిపి నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ను శాలువా కప్పి బొకేలు అందజేసి ఘనంగా సన్మానించారు అనంతరం మండలంలోని పలు విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు చెరువులు అభివృద్ధి కోసం గత 14 సంవత్సరాల నుంచి మరుగున పడినటువంటి ప్రతిపాదనలను తిరిగి ఆర్. ఆర్. ఆర్. కింద మండలంలోని 13 చెరువుల కు సుమారు 4 కోట్లు రూపాయలు నిధులను మంజూరు చేయడంతో మండలంలోని సాగు నీటి సంఘాల అధ్యక్షులు కృతజ్ఞతలు తెలిపారు అలాగే ఈసందర్భంగా 100 రోజుల జలదీక్ష లో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లోని చెరువులు అభివృద్ధి కోసం నివేదికలు తయారు చేయాలని, సోలార్ విద్యుత్ పై అవగాహన కల్పించాలని ,తదితర అంశాలపై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచించారు మంత్రి ఆనం ను కలిసిన వారిలో ఏఎస్పేట మండల టిడిపి ఉపాధ్యక్షులు పులిమి సుధాకర్ రెడ్డి, గుడిపాడు సాగునీటి సంఘ అధ్యక్షులు దేవరాల హజరతయ్య, పెద్దబీపురం మాజీ సర్పంచ్ అల్లంపాటి మాధవరెడ్డి, పొనుగోడు నీటి సంఘం అధ్యక్షులు ఎం వెంకటేశ్వర్లు నాయుడు, పందిపాడు మాజీ సర్పంచ్ సాగునీటి సంఘం అధ్యక్షులు అల్లంపాటి సుబ్బారెడ్డి, కుప్పురుపాడు సాగునీటి సంఘం అధ్యక్షులు సురేష్ నాయుడు, జమ్మవరం నాయకులు పైడి శ్రీనివాసులు, గుంపర్లపాడు సాగునీటి సంఘం అధ్యక్షులు దలువాయి వెంకటేశ్వర్లు, రాజవోలు మాజీ సర్పంచ్ గొల్లప్రోలు నరసయ్య, సిబివరం నాయకులు దామెర అనిల్ కుమార్, సూరం మాల కొండారెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు కప్పి బొకే అందజేసి ఘనంగా సత్కరించారు

# చెత్త రహిత, ఆరోగ్య గ్రామాలుగా తీర్చిదిద్దడమే మన ఎమ్మెల్యే శ్యామ్ కుమార్ లక్ష్యం






## తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్ గౌడ్

## కలెక్టర్ ఆదేశాలతో

## వంక శుభ్రత పనులు ప్రారంభం

**వెల్దుర్తి, ఏప్రిల్ 11, (సీమకిరణం న్యూస్) :** చెత్త రహిత, ఆరోగ్య గ్రామాలుగా తీర్చిదిద్దడమే పత్తికొండ ఎమ్మెల్యే శ్యామ్ కుమార్ లక్ష్యమని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్ గౌడ్ తెలిపారు. వెల్దుర్తి మండలం రామళ్లకోట రోడ్డులో ఉన్న వంక చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా మారడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం శుభ్రత కార్యక్రమం చేపట్టారు. పత్తికొండ నియోజకవర్గంలో గ్రామాల పరిశుభ్రత, అభివృద్ధి లక్ష్యంగా ఎమ్మెల్యే శ్యామ్ కుమార్ సూచనలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వంకలో పేరుకుపోయిన చెత్త, మట్టి, కోళ్ల వ్యర్థ పదార్థాలను జేసీబీ సహాయంతో తొలగించి ట్రాక్టర్ల ద్వారా తరలించారు. దీంతో వంక పూర్తిగా శుభ్రంగా మారడంతో పాటు, నీటి ప్రవాహానికి ఎటువంటి అడ్డంకులు లేకుండా సాఫీగా ప్రవహించే పరిస్థితి ఏర్పడింది.ఈ పనులను తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఎల్.ఈ. జ్ఞానేశ్వర్ గౌడ్ పరిశీలించి, అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు వ్యాప్తి చెందకుండా నిరోధించవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి,డిప్యూటీ ఎంపీడీవో రవి కిషోర్, పంచాయతీ అధికారులు లక్ష్మీనాథ్, ఆర్డబ్ల్యూ మునయ్య పాల్గొని పనులను పర్యవేక్షించారు. పంచాయతీ సిబ్బంది కూడా కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యారు.

# కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో 'విశ్రామ్ సదన్' నిర్మాణ పనులపై ఉన్నత స్థాయి సమీక్ష



**కర్నూలు వైద్యం, ఏప్రిల్ 11, (సీమకిరణం న్యూస్) :** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రోగుల సహాయకుల వసతి సౌకర్యార్థం పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ( సి ఎస్ ఆర్) నిధులతో నిర్మించడానికి తలపెట్టిన 'విశ్రామ్ సదన్' ప్రాజెక్టుపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె. వెంకటేశ్వర్లు పవర్ గ్రిడ్ మరియు ఎన్ బి సి సి ప్రతినిధులతో ఈరోజు ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. గత నవంబర్ 25న ప్రాథమిక చర్చలు జరిగిన నేపథ్యంలో, నేడు పనుల పురోగతి మరియు కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విశ్రామ్ సదన్ నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే మాస్టర్ ప్లాన్ మరియు డిజైన్లు సిద్ధమయ్యాయని, స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ సమీపంలో త్వరలోనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.త్వరలో అవసరమైన గ్రౌండ్ వర్క్ పూర్తి చేసి, శంకుస్థాపన కార్యక్రమానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. రూ. 14.6 కోట్ల భారీ వ్యయంతో నిర్మిస్తున్న ఈ 150 పడకల భవనాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ 18 నెలల కాలపరిమితిలోపు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎన్బిసిసి అధికారులను ఆదేశించారు. దీనివల్ల రోగి అటెండెంట్లకు ఆసుపత్రి ప్రాంగణంలో విశ్రాంతి తీసుకోవడానికి వీలుగా ఉంటుందన్నారు. ఈ విశ్రామ్ సదన్ను కేవలం రోగుల సహాయకుల కోసం మాత్రమే కేటాయించడం జరుగుతుందని,150 పడకల సామర్థ్యంతో ఉండే ఈ భవనం రోగుల సహాయకులకు అనుకూలంగా ఉండే లాగున మరియు అత్యంత పరిశుభ్రంగా నిర్వహించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. భవనం పూర్తయిన తర్వాత వసతి పొందే అటెండెంట్ల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసుకునేలా పారదర్శకమైన విధానాన్ని అమలు చేస్తామని, భద్రత మరియు పరిశుభ్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామన్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చే పేద రోగుల సహాయకులకు ఆసుపత్రి ఆవరణలో సురక్షితమైన నీడ కల్పించడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశమని ఆయన అన్నారు.

# ఏఎంసీ వార్డును ఆకస్మిక తనిఖీ చేసిన ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్









**కర్నూలు వైద్యం, ఏప్రిల్ 11, (సీమకిరణం న్యూస్):** కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు శనివారం ఆసుపత్రిలోని ఏఎంసి వార్డును సందర్శించారు. వార్డులో ప్రస్తుతం జరుగుతున్న ఎలక్ట్రికల్ పనులను అలాగే నూతన ఆక్సిజన్ ప్యానెల్ బోర్డ్స్ ను అమర్చడం వంటి పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. పనుల నాణ్యతను తనిఖీ చేసి, విద్యుత్ మరియు ఆక్సిజన్ సౌకర్యాల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం, వార్డులో రోగులకు అందుతున్న వైద్య సేవలను పర్యవేక్షించారు. వైద్య సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్న సూపరింటెండెంట్ రోగులకు నిరంతరం అందుబాటులో ఉండి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఆసుపత్రి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకూడదని, రోగుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు సిద్ధంగా ఉంచాలని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

## ఇరాన్ ఒక ఆర్థిక శక్తిగా మారనుందా
## యుద్ధం, సీజ్‌ఫైర్‌తో ఎలాంటి లాభం పొందిందంటే?




అమెరికా ఇరాన్ కాల్పుల విరమణ తరువాత, హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ నియంత్రణ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తోంది. ముడిచమురు రవాణాకు కీలకమైన ఈ మార్గంలో ఇరాన్ టోల్ విధించడంతో అంతర్జాతీయ షిప్పింగ్, చమురు ధరలు పెరుగుతాయి. భారత్ వంటి దేశాలపై ద్రవ్యోల్బణ ప్రభావం పడి, ప్రపంచ వాణిజ్యానికి కొత్త రిస్క్ ఏర్పడుతుంది. అమెరికా ఇరాన్ మధ్య 39 రోజుల పాటు కొనసాగిన ఘర్షణకు కాల్పుల విరమణతో ముగింపు వచ్చినప్పటికీ, దాని ఆర్థిక ప్రభావాలు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి పై ఇరాన్ సాధించిన కొత్త ప్రభావం, అంతర్జాతీయ వాణిజ్య సమీకరణాలను మారుస్తోంది. ప్రపంచ ముడి చమురులో దాదాపు 20 శాతం ఈ జలసంధి గుండా రవాణా అవుతుంది. యుద్ధ సమయంలో ఇరాన్ ఈ మార్గాన్ని అడ్డుకోవడంతో చమురు ధరలు భారీగా పెరిగి, సరఫరా గొలుసులు దెబ్బతిన్నాయి. ఈ ఒత్తిడి కారణంగా అమెరికా, ఇతర దేశాలు చర్చలకు ముందుకొచ్చినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. కాల్పుల విరమణ ఒప్పందం తరువాత, ఈ మార్గం గుండా వెళ్లే నౌకలపై టోల్ విధించే అవకాశాన్ని ఇరాన్ ప్రస్తావించడం కీలక పరిణామంగా మారింది. ఇది సాధారణ సముద్ర మార్గాన్ని ఒక ఆదాయ వనరుగా మార్చే ప్రయత్నంగా భావిస్తున్నారు. సరుకు పరిమాణం, స్వభావం ఆధారంగా రుసుములు నిర్ణయించే విధానం అమల్లోకి వస్తే, ఇది అంతర్జాతీయ రవాణా ఖర్చులను పెంచే ప్రమాదం ఉంది. ఈ పరిణామం ప్రభావం కేవలం షిప్పింగ్ కంపెనీలకే పరిమితం కాకుండా, గ్లోబల్ మార్కెట్లపై పడే అవకాశం ఉంది. ముఖ్యంగా భారత్ వంటి దిగుమతులపై ఆధారపడే దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలపై ఒత్తిడి పెరిగి, ద్రవ్యోల్బణం అధికమయ్యే అవకాశముంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఒప్పందాన్ని దౌత్య విజయం గా పేర్కొనగా, ఇరాన్ దీన్ని దీర్ఘకాలిక ఆర్థిక వ్యూహంగా మలుచుకున్నట్లు కనిపిస్తోంది. యుద్ధంలో మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నప్పటికీ, భవిష్యత్తులో స్థిరమైన ఆదాయ వనరును సృష్టించుకోవడంలో ఇరాన్ ముందంజ వేసింది. ఈ కాల్పుల విరమణ తక్షణ ఉపశమనం ఇచ్చినప్పటికీ, హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పెరిగిన నియంత్రణ ప్రపంచ వాణిజ్యానికి కొత్త రిస్క్‌గా మారే సూచనలు కనిపిస్తున్నాయి.

## ఖర్చుగా కాదు సామాజిక బాధ్యతగా చూడండి..
## సీఎస్ఆర్ నిధుల వినియోగంపై సీఎం కీలక సూచన!



సమాజ అభివృద్ధికి చేసేది ఖర్చుగా కాకుండా సామాజిక బాధ్యతగా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సీఎస్ఆర్ నిధులకు సంబంధించి వివిధ కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం (ఏప్రిల్ 08) సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేట్ కంపెనీలకు సీఎం రేవంత్ కీలక సూచనలు చేశారు. సమాజ అభివృద్ధికి చేసేది ఖర్చుగా కాకుండా సామాజిక బాధ్యతగా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సీఎస్ఆర్ నిధులకు సంబంధించి వివిధ కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం (ఏప్రిల్ 08) సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేట్ కంపెనీలకు సీఎం రేవంత్ కీలక సూచనలు చేశారు. కార్పొరేట్ కంపెనీలు సీఎస్ఆర్‌కు చేస్తున్న వ్యయం వందకు వంద శాతం సత్ఫలితాలు ఇచ్చేలా ఉండాలన్నారు. తమ ప్రభుత్వం విద్యా, వైద్యం, జల వనరుల సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. కంపెనీలు తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకుని సీఎస్ఆర్ నిధులు వినియోగించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రభుత్వంతో పాటు కంపెనీలు కలిపి చేసే వ్యయంతో తెలంగాణ విద్యార్థులను ప్రపంచ స్థాయి నైపుణ్యం కలిగిన వారు తీర్చిదిద్దాలన్నారు. భవిష్యత్ అవకాశాలు అందిపుచ్చుకునేలా తెలంగాణ విద్ష?ర్థులను తయారు చేయాలని సీఎం రేవంత్త రెడ్డి అన్నారు. విద్యపై పెట్టే వ్యయాన్ని తాము భవిష్యత్ తరాలపై పెట్టే పెట్టుబడిగా భావిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలోని విద్యార్థుల సంఖ్యలో హైదరాబాద్ మహానగరంలోనే 44 శాతం ఉన్నారని, వారికి నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందన్నారు. వివిధ కంపెనీలు స్థానికంగా ఉన్న అన్ని మౌలిక వసతులను వినియోగించుకుంటున్నందున తమ సీఎస్ఆర్ నిధుల్లో ఎక్కువ మొత్తాన్ని అదే ప్రాంత అభివృద్ధికి కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ సూచించారు. సీఎస్ఆర్ నిధుల వినియోగం కోసం ఒక ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని నియమించామని సీఎం తెలిపారు. కంపెనీల ప్రతినిధులు ఆయనతో సమన్వయం చేసుకుని తమకు ఆసక్తి ఉన్న విద్యా, వైద్యం, జల వనరులు, నైపుణ్య శిక్షణ, వారసత్వ కట్టడాల పరిరక్షణ, అడవుల సంరక్షణకు సీఎస్ఆర్ నిధులు వినియోగించవచ్చని ముఖ్యమంత్రి సూచించారు. ఇప్పటికే రహేజా గ్రూప్ రూ.50 కోట్లు, రాంకీ గ్రూప్ రూ.50 కోట్లు, యశోద ఫౌండేషన్ రూ.10 కోట్లు విద్యాభివృద్ధికి కేటాయించేందుకు ముందుకు వచ్చాయని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. వారిని సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సీఎస్ఆర్ నిధుల విషయంలో ఇప్పటి వరకు ఎవరూ తమను సంప్రదించలేదని అయా కంపెనీల ప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పాఠశాల విద్యా, ఆసుపత్రులు, వారసత్వ కట్టడాల పరిరక్షణకు పలు కంపెనీలు ఆసక్తి చూపాయి.

## మీరు వెండిని కొనుగోలు చేస్తున్నారా?
## తప్పకుండా గుర్తించుకోవాల్సిన విషయాలు ఇవే!



ప్రస్తుత ధర అంతర్జాతీయ మార్కెట్ ఆధారంగా వెండి ధరలు రోజూ మారుతుంటాయి. కొనే ముందు ఆ రోజు ధరను తప్పక సరిచూసుకోండి. ప్రస్తుతం దేశీయంగా వెండి ధరలు భారీ స్థాయిలో దిగి వస్తున్నాయి. గతంలో గరిష్టంగా కిలో వెండి ధర.. వెండిని (Silver) కొనుగోలు చేయడం అనేది కేవలం అలంకరణ కోసమే కాదు, ఒక మంచి పెట్టుబడి మార్గంగా కూడా చాలా మంది భావిస్తారు. అయితే, వెండి కొనే ముందు కొన్ని కీలక విషయాలను గమనించకపోతే నష్టపోయే ప్రమాదం ఉంది. మీరు వెండి వస్తువులు లేదా పెట్టుబడి కోసం వెండిని కొనాలనుకుంటే, ఈ క్రింది విషయాలను తప్పకుండా గుర్తుంచుకోండి: ప్రస్తుత ధర అంతర్జాతీయ మార్కెట్ ఆధారంగా వెండి ధరలు రోజూ మారుతుంటాయి. కొనే ముందు ఆ రోజు ధరను తప్పక సరిచూసుకోండి. ప్రస్తుతం దేశీయంగా వెండి ధరలు భారీ స్థాయిలో దిగి వస్తున్నాయి. గతంలో గరిష్టంగా కిలో వెండి ధర రూ.4 లక్షల వరకు వెళ్లగా ప్రస్తుతం రూ.2.60,000 వద్ద ట్రేడవుతోంది. అంటే గతంలో పోలిస్తే భారీ స్థాయిలోనే దిగి వచ్చింది. ఒక నెల రోజుల కిందటి ధరతో పోలిస్తే సుమారు రూ.50,000 వరకు దిగి వచ్చింది.

**వెండి కొనే ముందు గుర్తుంచుకోవాల్సిన విషయాలు:**

**మేకింగ్ ఛార్జీలు:** ఆభరణాలు లేదా పాత్రలు కొనేటప్పుడు జ్యువెలర్లు మేకింగ్ ఛార్జీలు వసూలు చేస్తారు. వీటి గురించి ముందే అడిగి తెలుసుకోవడం మంచిది. నమ్మకమైన విక్రేతలు: వెండి స్వచ్ఛత విషయంలో మోసపోకుండా ఉండాలంటే పేరున్న డీలర్లు లేదా జ్యువెలరీ షాపుల్లోనే కొనాలి. దీనివల్ల రీసేల్ (తిరిగి అమ్మేటప్పుడు) వాల్యూ బాగుంటుంది.

**సర్టిఫికేషన్:** మీరు కొనే వెండి బిస్కెట్లు లేదా ఆభరణాల స్వచ్ఛతను తెలిపే సర్టిఫికేట్ లేదా హాల్‌మార్కింగ్ తప్పనిసరిగా ఉండాలి.

**బరువు తనిఖీ:** వెండిని కొనే ముందు, కొన్న తర్వాత ఎలక్ట్రానిక్ వెయిట్ మెషిన్‌పై బరువును చెక్ చేయండి. ఆభరణాలలో అమర్చిన రత్నాలు లేదా పూసల బరువును వెండి బరువు నుండి మినహాయించారో లేదో గమనించండి. మీరు కేవలం వెండి బరువుకు మాత్రమే డబ్బు చెల్లించాలి.

**ప్యూర్ సిల్వర్ vs స్టెర్లింగ్ సిల్వర్ (తేడాలు):** ప్యూర్ సిల్వర్ (Fine Silver): ఇది 99.9% స్వచ్ఛమైనది. ఇది చాలా మెత్తగా ఉంటుంది. అందుకే దీనితో ఆభరణాలు చేయడం కష్టం. సాధారణంగా నాణేలు, బిస్కెట్ల రూపంలో ఇది లభిస్తుంది.

# ఇరాన్ అమెరికా మధ్య సీజ్‌ఫైర్! ఎల్‌పిజిపై కేంద్రం కీలక నిర్ణయం!



అమెరికా-ఇరాన్ ఘర్షణ కారణంగా ఏర్పడిన ఎల్‌పిజి కొరతను అధిగమించడానికి, కేంద్రం పారిశ్రామిక రంగానికి కొత్త సరఫరా విధానాన్ని ప్రకటించింది. PNG మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసే రాష్ట్రాలకు అదనపు 10 శాతం ఎల్‌పిజి కేటాయింపు ఉంటుంది. మరిన్ని వివరాలు ఇలా ఉన్నాయి. అమెరికా ఇరాన్ మధ్య సుమారు 39 రోజుల పాటు కొనసాగిన ఘర్షణ ముగిసిన నేపథ్యంలో భారత ప్రభుత్వం ఎల్‌పిజి సరఫరా విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. యుద్ధ సమయంలో హోర్ముజ్ జలసంధి మూసివేత కారణంగా ప్రపంచ ఇంధన సరఫరా దెబ్బతినగా, భారత్‌లో కూడా ఎల్‌పిజి కొరత ఏర్పడింది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, కేంద్రం పారిశ్రామిక రంగానికి ఎల్‌పిజి సరఫరా కోసం కొత్త ఫార్ములాను అమలు చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే గృహేతర (నాన్-డొమెస్టిక్) ఎల్‌పిజిలో రాష్ట్రాలకు కేటాయించిన 70 శాతం కోటాకు అదనంగా మరో 10 శాతం కేటాయింపు ఇవ్వనుంది. అయితే ఈ అదనపు కోటా, పైప్డ్ నేచరల్ గ్యాస్ (PNG) మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసే రాష్ట్రాలకే లభిస్తుంది. ఫార్మా, ఫుడ్ ప్రాసెసింగ్, స్టీల్, పాలిమర్స్, వ్యవసాయం, ప్యాకేజింగ్, పెయింట్స్, గ్లాస్, సిరామిక్స్ వంటి అనేక రంగాలకు బల్క్ ఎల్‌పిజి సరఫరా చేయాలని నిర్ణయించారు. ఈ పరిశ్రమలు 2026 మార్చి నాటికి తమ అవసరాల్లో కనీసం 70 శాతం ఎల్‌పిజి పొందేలా లక్ష్యంగా పెట్టుకున్నారు. రోజుకు 0.2 ౧మీ పరిమితితో ఎల్‌పిజి సరఫరా ఉంటుంది. సహజ వాయువుకు మారడం సాధ్యం కాని పరిశ్రమలకు మొదట ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ఇందుకోసం ఆయా యూనిట్లు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (OMCs) వద్ద నమోదు చేసుకోవాలి. అలాగే, సాధ్యమైన చోట ౯చీ+ కనెక్షన్ కోసం దరఖాస్తు చేయడం తప్పనిసరి. కేంద్రం, నేచ్యురల్ గ్యాస్ అండ్ పెట్రోలియం ప్రొడక్ట్స్ సప్లై ఆర్డర్ అమలు పై రాష్ట్రాలకు మార్గదర్శకాలు జారీ చేసింది. అదనపు 10 శాతం కోటాను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, అలాగే కంప్రెస్డ్ బయోగ్యాస్ (జదీ+) విధానాలను త్వరగా అమలు చేయాలని సూచించింది. యుద్ధానంతర ఇంధన ఒత్తిడిని తగ్గించేందుకు కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం, పరిశ్రమలకు తక్షణ ఉపశమనం కల్పించడమే కాకుండా, భవిష్యత్తులో గ్యాస్ వినియోగాన్ని సమతుల్యం చేసే దిశగా కీలక అడుగుగా భావిస్తున్నారు.

# కేవలం వడ్డీతోనే రూ. 4.40 లక్షల లాభం..
# రోజుకు రూ. 300 పొదుపుతో రూ. 15 లక్షల ఫండ్!

దీవర్ ౫ాష్ట్రవఎవ: ప్రతి వ్యక్తి తాను కష్టపడి సంపాదించిన డబ్బులో కొంత మొత్తాన్ని భవిష్యత్తు కోసం పొదుపు చేస్తాడు. అయితే, ఈ ద్రవ్యోల్బణ కాలంలో కేవలం డబ్బు ఆదా చేయడం మాత్రమే సరిపోదు. దానిని సరైన, సురక్షితమైన చోట పెట్టుబడి పెట్టడం కూడా అంతే.. సామాన్యుల పొదుపు కోసం పోస్ట్ ఆఫీస్ అందిస్తున్న పథకాలు ఎప్పుడూ భరోసానిస్తాయి. ప్రభుత్వ గ్యారెంటీ ఉండటంతో ఇందులో రిస్క్ సున్నా, లాభం మాత్రం ధీమాగా ఉంటుంది. అలాంటి ఒక అద్భుతమైన పథకమే పోస్ట్ ఆఫీస్ రికరింగ్ డిపాజిట్ (=ఌ). ఈ స్కీమ్ ద్వారా మీ చిన్న చిన్న పొదుపులు కొన్నేళ్లలో భారీ నిధిగా ఎలా మారుతాయో ఇప్పుడు చూద్దాం.



**స్కీమ్ ప్రధాన అంశాలు:**

తక్కువ పెట్టుబడి: ఈ ఖాతాను నెలకు కేవలం రూ. 100తో ప్రారంభించవచ్చు. 18 ఏళ్లు నిండిన ఏ భారతీయ పౌరుడైనా ఈ ఖాతాను తెరవవచ్చు.

వడ్డీ రేటు: ప్రస్తుతం ఈ పథకంపై ప్రభుత్వం 6.7 శాతం వార్షిక వడ్డీని అందిస్తోంది.

ఇవి కూడా చదవండి

18 క్యారెట్ల బంగారు ఉంగరం చేయించుకోవాలా? ఖర్చు ఎంతవుతుంది?

కేవలం రూ.2 లక్షలతో వ్యాపారం.. నెలకు రూ.50 వేల ఆదాయం..

మీ జీవితంలో ఈ 5 మంది వ్యక్తులు ఉన్నారా? అయితే విజయం మీ సొంతమే!

పెన్షనర్లకు శుభవార్త.. ఇక నెలవారీ పెన్షన్ రూ. 25,000 దాటవచ్చు..!

కాలపరిమితి: సాధారణంగా దీని మెచ్యూరిటీ కాలం 5 ఏళ్లు. అయితే, అవసరమైతే మరో 5 ఏళ్లు పొడిగించుకోవచ్చు (మొత్తం 10 ఏళ్లు).

జష్ట్రముఖజూవర్ ఖీబవశ్రీ: ప్రపంచంలోనే అత్యంత చౌకైన పెట్రోల్.. లీటర్ ధర కేవలం 3 రూపాయల లోపే..!

**అత్యవసర సమయంలో సౌకర్యాలు:**

లోన్ సదుపాయం: ఖాతా తెరిచిన ఏడాది తర్వాత మీ డిపాజిట్ మొత్తంలో 50 శాతం వరకు లోన్ తీసుకోవచ్చు. దీనిపై వడ్డీ రేటు చాలా తక్కువగా (RD వడ్డీ కంటే కేవలం 2% ఎక్కువ) ఉంటుంది.

ముందస్తు విత్‌డ్రా: అత్యవసర పరిస్థితి వస్తే, 3 ఏళ్ల తర్వాత ఈ ఖాతాను క్లోజ్ చేసే వెసులుబాటు ఉంది.

నామినీ సౌకర్యం: ఒకవేళ ఖాతాదారుడు మరణిస్తే నామినీ ఆ ఖాతాను కొనసాగించవచ్చు లేదా డబ్బును విత్డ్రా చేసుకోవచ్చు.

**రూ. 15 లక్షల ఫండ్ లెక్కలు ఇలా..**

మీరు ప్రతిరోజూ రూ. 300 పొదుపు చేయగలిగితే అది నెలకు రూ. 9,000 అవుతుంది. ఈ మొత్తాన్ని పోస్ట్ ఆఫీస్ ఆర్డీలో ఇన్వెస్ట్ చేస్తే:

5 ఏళ్ల తర్వాత: మీరు జమ చేసే అసలు రూ. 5.40 లక్షలు. వడ్డీతో కలిపి సుమారు రూ. 6.4 లక్షలు అవుతుంది.

**10 ఏళ్ల తర్వాత (పొడిగిస్తే):**

మీరు జమ చేసే మొత్తం అసలు: రూ. 10,80,000

మీకు వచ్చే వడ్డీ మాత్రమే: రూ. 4,40,889

మెచ్యూరిటీ సమయానికి మీ చేతికి వచ్చే మొత్తం: రూ. 15,20,889

ప్రభుత్వ నిబంధనల ప్రకారం వడ్డీ రేట్లు త్రైమాసికానికి ఒకసారి మారవచ్చు. పెట్టుబడి పెట్టే ముందు మీ సమీప పోస్ట్ ఆఫీస్‌లో తాజా వివరాలను సరిచూసుకోండి.

# స్లీపర్ బస్సుకు క్లయిమాక్స్ ఫిక్స్..?
# ఇకపై పుష్పక విమానాల్లాంటి బస్సులు రోడ్లపై కనిపించవా..?





నిన్నటిదాకా పుష్పక విమానాల్లా దర్జాగా తిరిగిన స్లీపర్ బస్సులు.. రేపటిరోజున వాషౌట్ అయిపోతే..! అవును, సీటర్ బస్సులుగా షేపౌట్ చేసుకుంటునే స్లీపర్ బస్సులను తిరగనిస్తామని రూలింగ్ పాస్ కాబోతోంది. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఆ దిశగానే ఆలోచిస్తున్నాయి. మరి, భారతదేశంలో స్లీపర్ బస్సులపై సంపూర్ణ నిషేధం సాధ్యమేనా? అంటే, వైనాట్ అంటున్నారు ఎక్స్‌పర్ట్స్. రెండేరెండేళ్లలో మన రోడ్లపై స్లీపర్ బస్సు ఒక్కటైనా కనిపించదు.. అని పక్కా యాక్షన్ ప్లాన్ కూడా సిద్ధమవుతోంది. మరి, స్లీపర్ బస్సులకు స్పీడ్ బ్రేకర్లు తప్పవా? నిన్నటిదాకా పుష్పక విమానాల్లా దర్జాగా తిరిగిన స్లీపర్ బస్సులు.. రేపటిరోజున వాషౌట్ అయిపోతే..! అవును, సీటర్ బస్సులుగా షేపౌట్ చేసుకుంటునే స్లీపర్ బస్సులను తిరగనిస్తామని రూలింగ్ పాస్ కాబోతోంది. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఆ దిశగానే ఆలోచిస్తున్నాయి. మరి, భారతదేశంలో స్లీపర్ బస్సులపై సంపూర్ణ నిషేధం సాధ్యమేనా? అంటే, వైనాట్ అంటున్నారు ఎక్స్‌పర్ట్స్. రెండేరెండేళ్లలో మన రోడ్లపై స్లీపర్ బస్సు ఒక్కటైనా కనిపించదు.. అని పక్కా యాక్షన్ ప్లాన్ కూడా సిద్ధమవుతోంది. మచ్చుకైనా కనిపించని భద్రతాప్రమాణాలు, బోలెడన్ని డిజైన్ లోపాలు , బేఖాతరయ్యే నిబంధనలు.. అన్నీ కలిసి స్లీపర్ బస్సులను నిలువునా తగలెడుతున్నాయి. ప్రయాణీకుల ప్రాణాలను మంటల్లో కలిపేస్తున్నాయి. మనుషులను కళేబరాలుగా మార్చేస్తున్నాయి. కేవలం 4 నెలల గ్యాప్‌లో ఆరు యాక్సిడెంట్లు జరిగితే 145 మంది చనిపోయారంటే స్లీపర్ బస్సులు ఎంత ప్రమాదకరమో మీకు అర్థమవుతుంది. ప్యాసింజర్ బస్సులకు సంబంధించి ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ అని కొన్ని ఉంటాయని తెలుసా..? మన దేశంలో ట్రావెల్ బస్సులు వాటిలో 50 శాతం కూడా పాటించడం లేదు. అత్యంత తక్కువ ఎత్తులో, పూర్తిగా వెనక్కు వాలే ఛాన్స్ లేక.. కనీసం ఆర్మ్ రెస్ట్ ఫెసిలిటీ కూడా లేకుండా ఏర్పాటు చేసిన బెర్తులు అసౌకర్యమే కాదు, మన ఆరోగ్యాల్ని కూడా తినేస్తున్నాయి. ఖర్మకాలి యాక్సిడెంట్ అయితే.. మిగిలేదేముంది? కాలి బూడిదవడమే..! స్లీపర్ బస్సుల్లో ఉండే డబుల్ బెర్త్ అయితే ఇంకా అసౌకర్యం.. ఒకరికొకరు తగలకుండా పడుకోవడం అసాధ్యం. పడుకుంటామనే గాని, అక్కడ కలత నిద్రే తప్ప సౌండ్ స్లీప్ అనేది కల్లే. పైగా, మన భారతీయ రహదారులపై కుషనింగ్ చాలా తక్కువ. బంపీనెస్ లేని రోడ్లపై ప్రయాణమంటే చచ్చేంత కుదుపులు ఖాయం. స్లీపర్ బస్సు డిజైనింగ్‌లో మెయిన్ ప్రాబ్లమ్ ఏంటంటే, బస్సు ఎత్తు. దీంతో వచ్చే గ్రావిటీ సమస్య. మలుపులు, కుదుపుల దగ్గర స్టీరింగ్ అదుపు తప్పి, ప్రమాదాలకు ఈజీగా దొరికిపోతాయి. సీటర్ బస్సులో మాగ్జిమమ్ 52 సీట్లుంటాయి. దాన్నే 48 బెర్తులతో స్లీపర్ బస్సుగా మార్చేస్తారు. అంతే బస్సు లోపల ఎంత ఇరుగ్గా ఉంటుందో దీన్ని బట్టే అర్థమవుతుంది. ఎమర్జెన్సీ ఎగ్జిట్స్ బ్లాకైపోకుండా ఏమేం ఏర్పాట్లున్నాయి, ఫైర్ డిటెక్షన్ సిస్టమ్స్ ఉన్నాయా లేవా.. ఫైర్ రెసిస్టెంట్ మెటీరియల్‌తో తయారయ్యే బెడ్డింగ్ ఉందా.. ఇవన్నీ ఆర్టీఓ తనిఖీల్లో రెగ్యులర్‌గా చెక్ చేసే పరిస్థితే లేదు. అందుకే, ఇలా నెలకోసారైనా మంటల్లో స్లీపర్ బస్ అనే బ్రేకింగ్ న్యూస్ వినాల్సి వస్తోంది. అన్ని వైపుల నుంచీ సిఫార్సులు వెల్లువెత్తడంతో స్లీపర్ బస్సుల నిషేధం దిశగా అడుగులు పడుతున్నాయి. వేలకొద్దీ ఉన్న స్లీపర్ బస్సులను ఉన్నపళంగా రద్దు చేయడం సాధ్యమేనా? అనే సందేహాలకు సమాధానం కూడా ఉంది. చిత్తశుద్ధి ఉంటే కేవలం రెండేళ్లలోనే స్లీపర్ బస్సులను నిర్మూలించవచ్చు.

**కంప్లీట్ బ్యాన్ ఎలా..?**

మొదటి మూడునెలల్లో ఉత్పత్తి, దిగుమతి నిలిపి వేయడం ఫస్ట్ స్టెప్.

తర్వాత తొమ్మిది నెలల పాటు రూట్ కెపాసిటీ ప్రకారం.. సీటర్ బస్సులతో స్లీపర్ సర్వీసులను రీప్లేస్ చెయ్యడం..

ఏడాదిన్నర లేదా రెండేళ్లలో స్లీపర్ బస్సులను పూర్తిగా నిలిపివేయవచ్చు.

ఈ రెండేళ్లలో ప్రయాణికులకు అసౌకర్యం లేకుండా చూడాలి.

హైస్పీడ్ రైళ్ల సంఖ్యను పెంచడం, చవక ప్రయాణాన్ని అలవాటు చేయడానికి ప్రత్యేక బడ్జెట్లు కేటాయించడం.. ఇవీ ప్రత్యామ్నాయ మార్గాలు

అంతర్రాష్ట్ర రవాణా వ్యవస్థను సరిగ్గా సమన్వయం చేసుకోవడం, తనిఖీల సంఖ్య పెంచడం, బస్సుల ఫిట్‌నెస్‌ను పెంచడం..

పెనాల్టీల మోతాదును పది లక్షల దాకా పెంచడం.. ఈ రూల్‌బుక్‌ని పాటిస్తే స్లీపర్ బస్సులపై కంప్లీట్ బ్యాన్ సాధ్యమేగా?

మరోవైపు జాతీయ మానవ హక్కుల కమిషన్ కూడా స్లీపర్ బస్సుల ప్రమాదాలపై సీరియస్‌గా రియాక్టయింది. చీ=జ చేసిన మొదటి సిఫార్సు కూడా ఇదే. అన్ని స్లీపర్ బస్సులను వెనక్కు పిలిపించాలని సూచించింది. స్లీపర్ బస్సులను నియంత్రించాల్సిందే అని కేంద్ర ప్రభుత్వానికి, అన్ని రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలకు, హైవేస్ అథారిటీకి లేఖలు కూడా రాసింది. సో, స్లీపర్ బస్సుకు క్లయిమాక్స్ మొదలైనట్టేనా?

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO. 27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2018/ 76380, Cell : 9133399830, 8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com